# ‘రైతుబంధు’ నిధులు దారికొస్తున్నయ్!

- మొత్తం రూ.36.6 లక్షలు దుర్వినియోగం
- తప్పును ఒప్పుకున్న ఏఈవో, మీసేవ నిర్వాహకులు
- ఇప్పటికే 16 లక్షలు అందజేత
- మిగతా నిధులూ ఇచ్చేందుకు అంగీకారం
- వ్యవసాయ శాఖలో ‘నమస్తే’ ప్రకంపనలు

నమస్తే ఎఫెక్ట్



బలిగేర గ్రామ పంచాయతీ కార్యాలయం

గద్వాల/గట్టు, ఫిబ్రవరి 25: రైతుబంధు నిధులు రూ.36.6 లక్షలు స్వాహా చేసిన కేసు లో నిందితులు దిగివచ్చారు. తప్పును ఒప్పుకొని సగం నిధులు అందజేయగా, మిగతా నిధులు త్వరలో చెల్లించేందుకు హామీ ఇచ్చా రు. ‘రైతుబంధు నిధులు పక్కదారి!’ శీర్షికన ఈ నెల 24న ‘నమస్తే తెలంగాణ’ మెయిన్ సంచికలో ప్రచురితమైన కథనం వ్యవసాయశాఖలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం బలిగేర గ్రామంలో రైతుబంధు నిధులు స్వాహా అయిన విషయం తెలిసిందే. నిధులను పక్కదారి పట్టించడంలో మాచర్ల, బలిగేరలో ఏఈవోగా పనిచేసిన దివ్యతో పాటు బలిగేర, ఇందువాసి గ్రామాల్లోని మీసేవ నిర్వాహకులు సద్దాం, వీరేశ్‌గౌడ్ పాత్ర ఉన్నదని స్పష్టమవుతున్నది. వీరు 2019 నుంచి నిధులను పక్కదారి పట్టించినట్టు తెలుస్తున్నది. పంటల నమోదు ప్రక్రియ సమయంలో సదరు ఏఈవో మీసేవ నిర్వాహకులకు పోర్టల్ లాగిన్ అప్పగించి ఈ పని చేయించినట్టు సమాచారం. ఇదే అదునుగా భావించిన మీ సేవ నిర్వాహకులు రైతుబంధు పోర్టల్‌లో కొత్త రైతుల వివరాలు నమోదు, ఎడిట్ ఆప్షన్ సమయంలో గ్రామంలో అందుబాటులో లేని, శాశ్వతంగా వలస వెళ్లిన రైతులను బినామీలుగా గుర్తించి అసలు రైతుల పీపీబీ నంబర్లకు వారి బ్యాంకు ఖాతాలను నమోదు చేశారు. ఇలా ఏకంగా గ్రామంలో 64 మంది అసలు రైతులను తప్పించి బినామీలను చేర్చారు. ఇలా రూ.36.6 లక్షల రైతుబంధు నిధులను బినామీలతోపాటు ఏఈవో, మీ సేవ నిర్వాహకులు పంచుకున్నారు. ఇదిలావుండగా సదరు మీ సేవ నిర్వాహకుడు ఏకంగా తన కుటుంబ సభ్యులతోపాటు బంధువుల అకౌంట్ నంబర్లను నమోదు చేసి నిధులు దండుకున్నాడు.

**బాధిత రైతులకు నిధుల అప్పగింత..**

నిధుల వ్యవహారం బయటకు పొక్కడంతో అసలు రైతులు ఏఈవోతోపాటు మీ సేవ నిర్వాహకులపై ఒత్తిడి తీసుకొచ్చారు. వీరంతా కలిసి రూ.16 లక్షల రైతుబంధు నిధులను అసలు రైతులకు ఇటీవల అందజేశారు. మిగిలిన డబ్బులను త్వరలో ఇచేచందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. రైతుబంధు నిధులను స్వాహా చేసిన ఏఈవో దివ్యను సస్పెండ్ చేయగా.. ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగించాలని రైతులు, రైతు సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. బాధ్యులైన మీ సేవ నిర్వాహకులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేయనున్నట్టు రైతు సంఘాల నాయకులు వెల్లడించారు.

## కొందుర్గులోనూ నిధులు పక్కదారి!

- వ్యవసాయాధికారి చేతివాటం!
- ఒకే ఖాతాకు రైతుబంధు, రైతుబీమా జమతో అనుమానం

షాద్‌నగర్, ఫిబ్రవరి 25 : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం కొందుర్గు మండల వ్యవసాయ శాఖ పరిధిలోనూ రైతుబంధు నిధులు పక్కదారి పట్టినట్టు తెలిసింది. రైతుల పేరిట నకిలీ పత్రాలను సృష్టించి వాటికి బ్యాంకు ఖాతాలు తెరిచి నిధులను దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. అదేవిధంగా రైతు బీమా సొమ్మునూ కాజేసినట్టు తెలుస్తున్నది. ఒకే ఖాతాకు రైతుబంధు, రైతుబీమా నిధులు వెల్లడంతో అనుమానం వచ్చిన సంబంధిత శాఖ అధికారులు లోతుగా విచారిస్తున్నట్టు సమాచారం. ఇదిలావుంటే సంబంధిత అధికారిని రెండు రోజుల క్రితమే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలిసింది. కాగా నిధుల దుర్వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టతనివ్వడం లేదు.

## కొమురవెల్లిలో భక్తుల రద్దీ

చేర్యాల, ఫిబ్రవరి 25: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో మల్లన్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల 6వ ఆదివారం 25 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పట్నాలు వేసి, ముడుపులు కట్టి, కోడెలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.







## దివ్యాంగులకు బీజేపీ టికెట్ ఇవ్వాలి

- తెలంగాణ వికలాంగుల హక్కుల జేఏసీ విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి25 (నమస్తే తెలంగాణ): వికలాంగుల హక్కుల కోసం ఏండ్లుగా పనిచేస్తున్న అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు, బీజేపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావుకు తెలంగాణలో ఏదైనా ఒక ఎంపీ స్థానాన్ని కేటాయించాలని తెలంగాణ వికలాంగుల హక్కుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి జేఏసీ చైర్మన్ మహంకాళి రవీందర్, అధ్యక్షుడు పులిపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 25 ఏండ్లుగా వికలాంగుల హక్కుల కోసం నాగేశ్వరరావు పోరాడుతున్నారని, బీజేపీలో కొన్నేండ్లుగా ఆయన సేవలందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి ఎంపీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

# ముస్లింల సభకు మంత్రుల డుమ్మా

- వీడియో కాల్‌తో సరిపెట్టిన వైనం
- ఎమ్మెల్యే కవ్వంపల్లి మాత్రమే హాజరు
- చిన్నబుచ్చుకున్న ముస్లిం జేఏసీ నేతలు



కరీంనగర్‌లో మంత్రి సందేశాన్ని ఫోన్‌లో వినిపిస్తున్న జేఏసీ నాయకుడు అబూబాకర్

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 25: ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభకు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. కేవలం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాత్రమే హాజరయ్యారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ముస్లింలంతా మనసు చిన్నబుచ్చుకున్నారు. అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించేందుకు చేసిన ఏర్పాట్లన్నీ నిష్ప్రయోజనం అయ్యాయని ముస్లిం జేఏసీ ప్రతినిధులు వాపోయారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి గెలిచిన శాసనసభ్యులు, మంత్రులను సత్కరించి, ముస్లింల సమస్యలపై దృష్టిసారించాలని కోరేందుకు కరీంనగర్‌లోని కమాన్ సమీపంలోగల ఓ బాంకెట్ హాలులో ఆదివారం ఉమ్మడి జిల్లా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు ముస్లిం సంఘాల ప్రతినిధులు, నాయకులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం ఏర్పాటు చేయగా.. 2.30వరకు ఎవరూ రాకపోవడంతో జేఏసీ ప్రతినిధులు అమాత్యులకు ఫోన్ చేశారు. అత్యవసర పనుల వల్ల తాము రాలేకపోతున్నామని, ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా తమ నాయకులకు అందజేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామంటూ వీడియోకాల్‌తో సరిపెట్టారు. దీంతో జేఏసీ ప్రతినిధులు అవాక్కయ్యారు. విషయం తెలుసుకున్న పలువురు ముస్లిం నాయకులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. చివరలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాగా.. ఆయనతోనే మమ అనిపించి సమావేశం ముగిస్తున్నట్టు ప్రకటించారు. మంత్రుల సంగతి అలా ఉంచితే.. ఎమ్మెల్యేలైనా రాకపోవడంపై ముస్లిం నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ గత ఎన్నికల్లో వారి గెలుపుకోసం తాము చేసిన కృషిని గుర్తుచేసుకోవడం కనిపించింది.

# కాంగ్రెస్‌లో పోస్టర్ల లొల్లి

- మల్లు రవి, సంపత్ పేరిట వెలసిన ఫ్లెక్సీలు
- ఎంపీ టికెట్ కోసం ఇరువురి నేతల రగడ
- అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీలో రాజకీయం వేడెక్కింది. పార్లమెంట్ టికెట్ ఆశిస్తున్న నేతలు పోస్టర్లు, ఫ్లెక్సీల వార్‌కు తెరలేపారు. టికెట్ తనకే ఇవ్వాలంటూ అధిష్ఠానంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే.. పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో మల్లు రవి, సంపత్‌కుమార్ పేరిట పెద్ద సంఖ్యలో పోస్టర్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. కాగా.. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్న డాక్టర్ మల్లు రవి ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. తన టికెట్‌కు ఈ పదవి అడ్డుకాకూడదనే రాజీనామా చేశానని, తానే గెలుపు గుర్రాన్ని అని ప్రకటించారు.

**కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీ**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మల్లు రవిది ఒకే కుటుంబం. దీంతో ఖమ్మం, నాగర్‌కర్నూల్ టికెట్ల కేటాయింపు ఒకదానికి మరొకటి ముడిపడి ఉందనే ప్రచారం కాంగ్రెస్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతున్నది. ఖమ్మం పార్లమెంట్ టికెట్ భట్టి విక్రమార్క సతీమణి ఆశిస్తూ అందుకు అవసరమైన ప్లాట్‌ఫాంను సిద్ధం చేసుకుంటున్నారు. ఖమ్మంలో భట్టి సతీమణికి టికెట్ ఇస్తే.. నాగర్‌కర్నూల్‌లో మల్లుకు టికెట్ నిరాకరించే అవకాశం ఉందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఒకే కుటుంబానికి రెండు టికెట్లు కష్టమేనని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

**మహబూబ్‌నగర్ స్థానానికి వంశీచంద్‌రెడ్డి**

ఇటీవల కోస్గిలో జరిగిన సభలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డి పోటీ చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. టికెట్ల కేటాయింపు విషయంలో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతోనే వంశీచంద్‌రెడ్డి పేరు ప్రకటించారని, నాగర్‌కర్నూల్‌కు సంపత్‌ను ప్రోత్సహిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతున్నది. కాగా.. మల్లు రవికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు అండగా ఉన్నారని ఆరోపణలున్నాయి.




నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్ కల్వకుర్తిలో మల్లు రవి, సంపత్‌కుమార్ పేరిట వెలసిన పోస్టర్లు




## యాదవులకు మంత్రి పదవి ఇవ్వాలి

- యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): యాదవ సామాజికవర్గానికి చెందిన నేతలకు రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించాలని యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని డి మాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోపు యాదవ నేతలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో 14 శాతం జనాభా ఉన్న యాదవులకు రెండు లోక్‌సభ స్థానాలను కేటాయించాలని కోరారు. ఉమడి ఏపీలో గానీ, తెలంగాణ రాష్ట్రంలోనూ యాదవులు మంత్రివర్గంలో ఉండటం ఆనవాయితీగా వస్తున్నదని గుర్తుచేశారు. ప్రస్తుత మంత్రి వర్గంలో ఒక్కరు కూడా యాదవ మంత్రి లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇది యాదవ సామాజిక వర్గాన్ని అవమానించడమేనని తెలిపారు. నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని, యాద వ ఫైనాన్స్ కార్పొరేషన్ హామీని నెరవేర్చాలని కోరారు. లేదంటే యాదవులందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

# విచారణకు హాజరుకాలేను

- వర్చువల్ పద్ధతిలో అందుబాటులో ఉంటా
- సీఆర్పీసీ 41ఏ కింద నోటీసులు సబబు కాదు
- ఎన్నికల ప్రక్రియలో పాల్గొనకుండా అడ్డుకునే చర్య
- సీబీఐకి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద తనకు జారీ చేసిన నోటీసులను రద్దుచేయాలని లేదా ఉపసంహరించుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీబీఐకి లేఖ రాశారు. ముందే నిర్ణయించిన కార్యక్రమాల రీత్యా ఈ నెల 26న విచారణకు హాజరు కావడం సాధ్యం కాదని తెలిపారు. ఒకవేళ సీబీఐకి తన నుంచి ఏవైనా ప్రశ్నలకు సమాధానాలు, సమాచారం కావాలనుకుంటే వర్చువల్ పద్ధతిలో హాజరవుతానని స్పష్టంచేశారు. తనకు సీఆర్పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీచేయడం సబబు కాదని పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులకు పూర్తి విరుద్ధంగా తాజా నోటీసులు జారీ చేశారని ఆరోపించారు. గతంలో (2022, డిసెంబర్)లో అప్పటి ఐవో (విచారణ అధికారి) సెక్షన్ 160 కింద నోటీసులు జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం 41ఏను ఏ పరిస్థితుల్లో జారీ చేశారో స్పష్టత లేదని పేర్కొన్నారు. అసలు సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఎందుకు జారీ చేశారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నోటీసులు జారీచేయడంపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా, తనకున్న ప్రజాస్వామిక, రాజ్యాంగహక్కుకు భంగం కలిగించడంలో భాగంగానే సీబీఐ నోటీసు జారీ చేసిందని ఆరోపించారు. తనపై సీబీఐ చేస్తున్న ఆరోపణల్లో తన పాత్రలేదని, పైగా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదని గుర్తుచేశారు. గతంలో ఈడీ తనకు నోటీసులు జారీ చేసిన సమయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించానని, ఈ కేసు పెండింగ్‌లో ఉన్నదని వివరించారు. తనను విచారణకు పిలవబోమని అదనపు సొలిసిటర్ జనరల్ సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చారని, ఇది సీబీఐకి కూడా వర్తిస్తుందని స్పష్టంచేశారు. గతంలో సీబీఐ బృందం హైదరాబాద్‌లోని తన నివాసానికి వచ్చినప్పుడు విచారణకు సహకరించిన విషయాన్ని ఉదహరించారు. 15 నెలల విరామం తరువాత ఇప్పుడు సీబీఐ విచారణకు పిలవడం, సెక్షన్ల మార్పు అనేక అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రానున్న ఆరు వారాలపాటు పార్టీ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నదని, ఈ కారణాల రీత్యా ఫిబ్రవరి 26న విచారణకు హాజరు కాలేనని తెలిపారు. కావున తనకు ఇచ్చిన నోటీసులను నిలిపేయాలని కోరారు.



ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న కవిత

## కోనసీమ పర్యటనలో ఎమ్మెల్సీ కవిత

ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కల్వకుంట్ల కవిత పర్యటించారు. పీ గన్నవరం మండలం ముంగండ గ్రామంలో ఆదివారం నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునఃప్రాతిష్ఠాపన వేడుకల్లో పాల్గొనడంతో పాటు కడియం నర్సరీని సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానికులు ఆమెను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఈ నర్సరీ మొక్కల ప్రత్యేకతలు, వాటి పెంపకం తీరు తెన్నులను నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, వీరబాబు, రాజశేఖర్ ఈ సందర్భంగా కవితకు వివరించారు.